# నర్సాపూర్‌లో సత్తాచాటిన బీఆర్‌ఎస్

## 8875 ఓట్ల మెజార్టీతో సునీతాలక్ష్మారెడ్డి గెలుపు


రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సునీతాలక్ష్మారెడ్డి

మెదక్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఘన విజయం సాధించారు. మెదక్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఆదివారం హవేళీఘనపూర్‌లోని వైపీఆర్ కళాశాలలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించారు. అనంతరం ఈవీఎంలను లెక్కించారు. ఉదయం 9 గంటల తర్వాత తొలి రౌండ్ ఫలితాలు ప్రకటించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల వరకు చివరి ఫలితాలను ప్రకటించారు. ఈ ఉత్కంఠ పోరులో నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిపై 8875 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మెదక్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్ 10157 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

### రౌండ్ రౌండ్‌లో ఉత్కంఠ

మెదక్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు సాగింది. ఆదివారం ఉదయం 8 గంటలకుప్రారంభమైన ఎన్నికల ఓట్ల లెక్కింపులో తొలి ఆరు రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌కు అధిక్యం రాగా, ఏడో రౌండ్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డికి 370 ఓట్లతో లీడ్‌లో ఉంది. ఆ తర్వాత 14వ రౌండ్ వరకు కాంగ్రెస్ అధిక్యంలో ఉంది. 16, 17వ రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 1988 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌కు 18, 19, 20 రౌండ్లలో అధిక్యం రావడంతో 10,157 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మెదక్ నియోజకవర్గంలో మొత్తం 18,86,946 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీఆర్‌ఎస్‌కు 76,969 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 87,126 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 13,657 ఓట్లు రాగా, బీఎస్పీకి 1112 ఓట్లు వచ్చాయి. నోటాకు 1860 ఓట్లు పోలు కాగా, 83 ఓట్లు చెల్లనివి. పోస్టల్ బ్యాలెట్‌లో బీఆర్‌ఎస్‌కు 334 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 1253 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 305 ఓట్లు పోలయ్యాయి.

### నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్‌దే హవా..

నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఘన విజయం సాధించారు. బీఆర్‌ఎస్ సర్కారు చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఆసరా పింఛన్లు, దళితబంధు, రైతు బంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ తదితర పథకాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసింది. వీటన్నింటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిపైన 8875 ఓట్ల మెజార్టీతో సునీతాలక్ష్మారెడ్డి గెలుపొందారు. మొదటి రౌండ్‌లో బీఆర్‌ఎస్‌కు 677 ఓట్లు రాగా, 5వ రౌండ్‌లో 177 ఓట్లు, 6వ రౌండ్‌లో 22 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత కాంగ్రెస్ అధిక్యంలో ఉంది. బీఆర్‌ఎస్‌కు 9వ రౌండ్‌లో 453 ఓట్లు, 10వ రౌండ్‌లో 374 ఓట్లు, 11వ రౌండ్‌లో 588 ఓట్లు, 12వ రౌండ్‌లో 217ఓట్లు, 13వ రౌండ్‌లో 156 ఓట్లు, 14వ రౌండ్‌లో 3 ఓట్లు, 15వ రౌండ్‌లో 537 ఓట్లు, 16వ రౌండ్‌లో 1362 ఓట్లు, 17వ రౌండ్‌లో 1383 ఓట్లు, 18వ రౌండ్‌లో 1172 ఓట్లు వచ్చాయి. 20వ రౌండ్‌లో 1876 ఓట్లు, 21వ రౌండ్‌లో 2049 ఓట్లు, 22వ రౌండ్‌లో 1081 ఓట్లు వచ్చాయి. మొత్తంగా 8875 ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి విజయం సాధించారు.



మెదక్‌లో మైనంపల్లి రోహిత్ ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కాంగ్రెస్ ఎన్నికల ఏజెంట్

# గజ్వేల్ నుంచి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్



సిద్దిపేట, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లాలో గజ్వేల్ శాసనసభ స్థానం నుంచి సీఎం కేసీఆర్ మూడో సారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టగా, సిద్దిపేట నుంచి మంత్రి హరీశ్‌రావు వరుసగా ఏడోసారి విజయం సాధించారు. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్ శాసన సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ మూడోసారి ఘన విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. ఈ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు 45,283 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించారు. సీఎం కేసీఆర్ గజ్వేల్ నుంచి వరుసగా మూడో సారి గెలుపొందడం రికార్డుగా చెప్పవచ్చు. ఇంతవరకు ఈ నియోజకవర్గం నుంచి ఏ ఎమ్మెల్యే అయినా వరుసగా మూడుసార్లు గెలిచిన సందర్భాలు లేవు. 2014 ఎన్నికల్లో సీఎం కేసీఆర్ 19,391 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2018 ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి వంటేరు ప్రతాప్‌రెడ్డిపై సీఎం కేసీఆర్ 58,290 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

### సిద్దిపేటలో ఏడోసారి మంత్రి హరీశ్‌రావు విజయం

సిద్దిపేట శాసనసభ స్థానం నుంచి వరుసగా ఏడోసారి ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఘన విజయం సాధించారు. మరోసారి ప్రతిపక్షాల డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఈ ఎన్నికల్లో 83,025 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. దేశ చరిత్రలోనే ఒకే శాసన సభ స్థానం నుంచి వరుసగా ఏడోసారి పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొందడం రికార్డుగా చెప్పవచ్చు. ఈ అరుదైన రికార్డును మంత్రి హరీశ్‌రావు సొంతం చేసుకున్నారు. నిరంతరం ప్రజా సేవలో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం రాత్రింబవళ్లు పనిచేసే నాయకుడికి నియోజకవర్గ ప్రజలు మెజార్టీ ఇచ్చి పట్టం కట్టారు. ప్రతి ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిగా భావించిన నియోజకవర్గ ప్రజలు మంత్రి హరీశ్‌రావును అక్కున చేర్చుకున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 2004 అక్టోబర్‌లో మొదటి సారి సిద్దిపేట శాసన సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికలో తన సమీప టీడీపీ అభ్యర్థి చెరుకు ముత్యంరెడ్డి పై 24,827 ఓట్ల మెజార్టీతో హరీశ్‌రావు గెలుపొందారు. అప్పటి నుంచి విజయాలతో దూసుకెళ్తున్నారు. తర్వాత ప్రతి ఎన్నికల్లో తన మెజార్టీని తానే అధిగమిస్తూ ప్రత్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేస్తూ తిరుగులేని నేతగా ఎదిగారు. 2008లో జరిగిన ఉప ఎన్నికల్లో సమీప కాంగ్రెస్ అభ్యర్థి పై 58,935 ఓట్లతో రికార్డు స్థాయి మెజార్టీతో గెలుపొందగా, 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 64,014 ఓట్ల మెజార్టీ సాధించి తన రికార్డును తానే తిరగరాశారు. 2010లో మరోసారి జరిగిన ఉప ఎన్నికల్లో 95,858 ఓట్లు, 2014లో 93,328 ఓట్లతో భారీ మెజార్టీతో గెలుపొందారు. 2018 సాధారణ ఎన్నికల్లో 1,18,699 ఓట్ల మెజార్టీతో డబుల్ హ్యాట్రిక్ కొట్టారు. ఏడోసారి ఘనవిజయం సాధించడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.


దుబ్బాకలో విజయోత్సవ ర్యాలీలో కొత్త ప్రభాకర్‌రెడ్డి



సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఓట్లు లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

# మెతుకుసీమ గులాబీ కోట

## బీఆర్‌ఎస్‌దే విజయ దుందుభి .. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుచోట్ల బీఆర్‌ఎస్ విజయం

- మూడు చోట్ల కాంగ్రెస్ పార్టీ గెలుపు
- గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్
- సీఎం కేసీఆర్‌కు 45,031 ఓట్ల మెజార్టీ
- సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావుకు 82,156 మెజార్టీ.. వరుసగా ఏడోసారి గెలుపు
- దుబ్బాకలో కొత్త ప్రభాకర్‌రెడ్డికి 53,513 ఓట్ల భారీ మెజార్టీ
- దుబ్బాకలో దుమ్ములేపిన బీఆర్‌ఎస్
- పటాన్‌చెరు నుంచి హ్యాట్రిక్ కొట్టిన గూడెం మహిపాల్‌రెడ్డి
- జహీరాబాద్‌లో రెండోసారి విజయం సాధించిన మాణిక్‌రావు

సిద్దిపేట, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ విజయ దుందుభి మోగించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గాలి వీచినప్పటికి ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ తన పట్టును నిలుపుకొంది. ప్రతి రౌండ్‌లోనూ బీఆర్‌ఎస్ జోరు కనిపించింది. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఆందోల్, నారాయణఖేడ్, మెదక్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్ స్థానం కాంగ్రెస్ గెలుచుకోగా, జనగామ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొందింది. జిల్లాలో కారు స్పీడ్‌కు కాంగ్రెస్, బీజేపీలు తట్టుకోలేక పోయాయి. గజ్వేల్ శాసనసభ స్థానం నుంచి పోటీచేసిన బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. తన సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన ఈటల రాజేందర్‌పై 45,031 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సిద్దిపేట నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఏడోసారి బరిలోకి దిగిన మంత్రి హరీశ్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన పూజల హరికృష్ణపై 82,156 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్ రావుపై 53,513 ఓట్ల మెజార్టీతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. తొలిసారిగా దుబ్బాక నుంచి ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. నర్సాపూర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డిపై 9,855 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌పై 13, 310 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వరుసగా ఆయన రెండోసారి గెలుపొందారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్ తన సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగ్గారెడ్డిపై 8,725 ఓట్ల మెజార్టీతో, పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌పై 7091ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వరుసగా ఈ నియోజకవర్గం నుంచి మూడుసార్లు గూడెం మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ కొట్టారు. జనగామ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన పల్లా తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డిపై 16,836 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

### కాంగ్రెస్ పార్టీ విజయం

ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడుచోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. అందోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ రాజనర్సింహ తన సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌పై 27,427 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మెదక్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి రోహిత్ తన సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిపై 10,157 ఓట్ల మెజార్టీ, నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన పట్లోళ్ల సంజీవరెడ్డి తన సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డిపై 5,766 ఓట్ల మెజార్టీ, హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన పొన్నం ప్రభాకర్ తన సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌పై 19,344 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

### దుబ్బాకలో దుమ్మురేపిన బీఆర్‌ఎస్

దుబ్బాక నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి విజయం సాధించారు. గత ఉప ఎన్నికల్లో ఇక్కడ స్వల్ప ఓట్ల మెజార్టీతో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. ఈ నియోజకవర్గంలో19 రౌండ్లలో కౌంటింగ్ చేపట్టారు. ప్రతి రౌండ్‌లోనూ బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో దూసుకుపోయింది. 19 రౌండ్ ముగిసే సరికి దుబ్బాక దుమ్ములేచేలా ఇక్కడి ప్రజలు కొత్త ప్రభాకర్‌రెడ్డిని 53, 513 ఓట్ల మెజార్టీతో గెలిపించారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ డిపాజిట్ గల్లంతైంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మంత్రి తన్నీరు హరీశ్‌రావు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఆయనకు 83,025 ఓట్ల మెజార్టీని సిద్దిపేట నియోజకవర్గ ప్రజలు కట్టబెట్టారు. దుబ్బాక నుంచి మొదటి సారిగా శాసన సభ స్థానానికి పోటీ చేసిన కొత్త ప్రభాకర్‌రెడ్డికి 53,513 ఓట్ల భారీ మెజార్టీతో దుబ్బాక నియోజకవర్గ ప్రజలు గెలిపించారు. జిల్లాలో నారాయణఖేడ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డికి 5,766 ఓట్ల అత్యల్ప మెజార్టీ వచ్చింది.




# మూడుచోట్ల ఎగిరిన గులాబీజెండా

## సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ గెలుపు


విజయ సంకేతం చూపుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

- చింతాప్రభాకర్, మాణిక్‌రావు గెలుపుతో సంబురాల్లో పార్టీ శ్రేణులు
- హ్యాట్రిక్ విజయం సాధించిన మహిపాల్‌రెడ్డి
- రీకౌంటింగ్ కోసం పటాన్‌చెరు కాంగ్రెస్ అభ్యర్థి కాటా పట్టు
- పటాన్‌చెరు గెలుపుపై అధికారిక ప్రకటనలో జాప్యం
- మంత్రి హరీశ్‌రావును కలిసిన విజేతలు

సంగారెడ్డి, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాలను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఆదివారం సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం వర్సిటీలో జరిగింది. ఐదు అసెంబ్లీ స్థానాలకు సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించింది. సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్, జహీరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు, పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి గెలుపొందారు. పటాన్‌చెరులో 7వేల పైచిలుకు మెజార్టీతో మహిపాల్‌రెడ్డి విజయం సాధించారు. మూడు నియోజవర్గాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మహిపాల్‌రెడ్డి గెలుపొందినట్లు తెలియగానే కౌంటింగ్ కేంద్రాల వద్దనే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు పటాకులు కాల్చడంతో పాటు మిఠాయిలు పంచిపెట్టి విజయోత్సవ సంబురాలు నిర్వహించుకున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు నేతలు మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ఆశీర్వాదం, ప్రజల మద్దతుతో తాము గెలుపొందినట్లు తెలిపారు. తమ నియోజకవర్గ ప్రజలు ఆశీస్సుల వల్లే తాము ఎమ్మెల్యేలుగా గెలుపొందామని, రాబోయే రోజుల్లో వారి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని గెలిచిన ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్, మాణిక్‌రావు, మహిపాల్‌రెడ్డి తెలిపారు. గెలిచిన ముగ్గురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మంత్రి హరీశ్‌రావును కలిశారు. ఎన్నికల్లో గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్,మాణిక్‌రావు, మహిపాల్ రెడ్డిని మంత్రి హరీశ్‌రావు అభినందించారు. కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ రీ కౌంటింగ్ పట్టుబట్టారు. దీంతో పటాన్‌చెరులో మహిపాల్‌రెడ్డి గెలుపు ప్రకటనపై జాప్యం నెలకొంది. అందోలు అసెంబ్లీలో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ, నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి గెలుపొందారు.

### సంగారెడ్డిలో 9297 మెజార్టీతో చింతా గెలుపు

సంగారెడ్డి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ విజయం సాధించారు. 9297 ఓట్ల మెజార్టీతో చింతా ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ఆధిక్యంలో కొనసాగారు. మొదటి రౌండ్ నుంచి సమీప కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డిపై చింతా ప్రభాకర్ అధిక్యతను ప్రదర్శిస్తూనే వచ్చారు. 4, 5వ రౌండ్‌లో కొంత వెనకబడినా ఆతర్వాత ప్రతి రౌండ్‌లో చింతా ప్రభాకర్ స్పష్టమైన మెజార్టీ సాధిస్తూ వచ్చారు. 18 రౌండ్లపాటు ఓట్ల లెక్కింపు జరగగా చింతా ప్రభాకర్ 9297 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 1,89,979 ఓట్లు పోల్‌కాగా, చింతా ప్రభాకర్ 82,614 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి జగ్గారెడ్డికి 73,317 ఓట్లు వచ్చాయి. 9297 ఓట్ల మెజార్టీతో చింతాప్రభాకర్ విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన చింతాప్రభాకర్‌ను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు. కౌంటింగ్ కేంద్రం నుంచి సంగారెడ్డి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలో చింతాప్రభాకర్ పార్టీ శ్రేణులతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి ప్రజల సంపూర్ణ మద్దతు, పార్టీ శ్రేణుల కృషితోనే తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన విజయం కోసం కృషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి నుంచి చింతా ప్రభాకర్ రెండోమారు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తాజాగా ఎన్నికల్లో మరోమారు ఎమ్మెల్యేగా గెలుపొందారు. జిల్లా నుంచి విజయం సాధించిన ఏకైక బీసీ ఎమ్మెల్యే ప్రభాకర్ కావడం గమనార్హం. ప్రభాకర్ స్వయంగా పార్టీ ముఖ్యనాయకులతో కలిసి రిటర్నింగ్ ఆఫీసర్ వద్ద గెలుపొందినట్లు సర్టిఫికెట్ తీసుకున్నారు.

### రెండోసారి విజయం సాధించిన మాణిక్‌రావు

జహీరాబాద్ ఎమ్మెల్యేగా మాణిక్‌రావు రెండోసారి విజయం సాధించారు. బీఆర్‌ఎస్ నుంచి బరిలో దిగిన ఆయన 12,790 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,07,763 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో మాణిక్‌రావుకు 97,205 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి చంద్రశేఖర్‌కు 84,415 ఓట్లు వచ్చాయి. 12,790 ఓట్ల మెజార్టీతో మాణిక్‌రావు రెండవమారు ఎమ్మెల్యేగా గెలుపొందారు. జహీరాబాద్ ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి మాణిక్‌రావు ప్రతిరౌండ్‌లో అధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. మాణిక్‌రావు గెలుపొందినట్లు ప్రకటించగానే బీఆర్‌ఎస్ శ్రేణులు ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద సంబరాలు జరుపుకున్నాయి. మాణిక్‌రావు స్వయంగా వచ్చి రిటర్నింగ్ ఆఫీసర్ నుంచి గెలుపొందినట్లు సర్టిఫికెట్ తీసుకున్నారు. ఆ తర్వాత పట్టణంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావును కలిశారు.

### పటాన్‌చెరులో గూడెం హ్యాట్రిక్ విజయం..

పటాన్‌చెరులో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించారు. ఓట్ల లెక్కింపులో మహిపాల్‌రెడ్డి సమీప కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్‌పై 7070 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్తి మహిపాల్‌రెడ్డి ప్రతి రౌండ్‌లో అధిక్యం ప్రదర్శించారు. కాంగ్రెస్ పై 7070 ఓట్ల మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకున్నారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ రీ కౌంటింగ్ పట్టుబట్టడంతో పటాన్‌చెరు రిటర్నింగ్ ఆఫీసర్ మహిపాల్‌రెడ్డి గెలుపొందినట్లు అధికారికంగా ప్రకటన చేయటంలో జాప్యం చేశారు. మహిపాల్‌రెడ్డి గెలుపు విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాయి.

### అందోలు, ఖేడ్‌లో కాంగ్రెస్ గెలుపు

అందోలు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. అందోలు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్ గెలుపొందారు. అందోల్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌కు 85677 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్‌కు 113104 ఓట్లు వచ్చాయి. 28,193 ఓట్ల మెజార్టీతో దామోదర గెలుపొందారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి గెలుపొందారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డికి 84,515 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డికి 90281 ఓట్లు వచ్చాయి. 5766 ఓట్ల మెజార్టీతో సంజీవరెడ్డి గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో బీజేపీ ఎక్కడా ప్రభావం చూపించలేక పోయింది.


కౌంటింగ్ కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి


దుబ్బాకలో విజయోత్సవ ర్యాలీలో అభివాదం చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి